కైలాసగిరిపై సాహస క్రీడలు

జిప్ లైనర్, స్కై సైక్లింగ్‌కు ఏర్పాట్లు

- ఇప్పటికే టవర్ల నిర్మాణం పూర్తి
- రెండు, మూడు రోజుల్లో ట్రయల్ రన్
- దసరా నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్న అధికారులు

- 7లో



వైసీపీ నేతల చేతివాటం

జగనన్న కాలనీల్లో సిమెంట్, ఇనుము మాయం

- 60 టన్నుల ఇనుము, 25 వేల బస్తాల సిమెంట్ తస్కరణ
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జనసైనికులు ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్



రొంగలివానిపాలెంలో పునాదుల స్థాయిలోనే నిలిచిన ఇళ్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల నిర్మాణాల మాటున వైసీపీ నేతలు సాగించిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంట్, ఇనుమును దారిమళ్లించారు. దర్జాగా అమ్ముకొని జేబులు నింపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వైసీపీ అధికారంలో వున్నప్పుడు పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో అనకాపల్లి మండలం సంపతిపురం, రొంగలివానిపాలెం, కూండ్రం, కుంచంగి, మామిడిపాలెం, వీజేపాలెం, పాపయ్యపాలెం, పిసినికాడ, సీతానగరం గ్రామాల్లో విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో జగనన్న లేఅవుట్‌లు వేశారు. జీవీఎంసీ పరిధిలో పలు ప్రాంతాలకు చెందిన సుమారు 10,760 మందికి ఈ లేఅవుట్లలో స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు టెండర్లు పిలిచారు. తక్కువ రేటుకు కోట్ చేసిన ఒక కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.8 లక్షలు కేటాయించింది. భవన నిర్మాణానికి ఈ నిధులు చాలవంటూ ఒక్కో లబ్ధిదారు అదనంగా రూ.50 వేలు చెల్లిస్తే కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణ పనులు చేపడతారని అధికారులు చెప్పారు. ఈ మేరకు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారు. ప్రభుత్వం లబ్ధిదారుల పేరుతో కాంట్రాక్టర్‌కు సిమెంట్, ఇనుము, ఇసుక సరఫరా చేసింది. మొత్తం 4,558 గృహాలకుగాను ఇంతవరకు 886 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. 1,613 ఇళ్లు బేస్‌మెంట్ వరకు, 290 ఇళ్లు శ్లాబ్ వరకు, 980 ఇళ్లు లింటల్ స్థాయిలో ఉన్నాయి. 789 ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా మొదలు కాలేదు. కాగా ప్రభుత్వం మారితే బిల్లులు వస్తాయో, లేదో అన్న అనుమానంతో ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టర్ ఎన్నికల సమయంలో పనులు ఆపేశారు. ఇళ్ల నిర్మాణ పనులకు ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంటు, ఇనుముకు అధికారులు సరైన భద్రత కల్పించలేదు. ఇదే అదనుగా భావించిన కొంతమంది వైసీపీ నాయకులు సంపతిపురం, కూండ్రం, రొంగలివానిపాలెం గ్రామాల్లో జగనన్న కాలనీలకు సరఫరా అయిన సిమెంట్, ఇనుము మాయం చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ ఓడిపోవడంతో ఓట్ల లెక్కింపు జరిగిన రోజు రాత్రి పలువురు వైసీపీ నాయకులు జగనన్న కాలనీల్లో నిల్వ చేసిన సిమెంట్, ఐరన్‌ను ఎత్తుకుపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు 60 టన్నుల ఇనుము, 25 వేల పైచిలుకు సిమెంట్ బస్తాలు ఎత్తుకుపోయి అమ్ముకున్నట్టు తెలిసింది. ఇళ్ల లబ్ధిదారులంతా విశాఖ నగరానికి చెందిన వారు కావడం, స్థానికంగా వుండకపోవడం, ఎన్నికల సమయంలో కాంట్రాక్టర్ పనులు ఆపేయడంతో స్థానిక వైసీపీ నాయకులు ... మిగతా 8వ పేజీలో



సబ్బవరం మండలం అమృతపురంలో లబ్ధిదారునికి పింఛన్ డబ్బులు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

96.56 శాతం మందికి పింఛన్ల పంపిణీ

జిల్లాలో 2,60,816 మంది లబ్ధిదారులు

- తొలిరోజు 2,52,082 మందికి డబ్బులు అందజేత
- మిగిలిన వారికి నేడు పంపిణీ

అనకాపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ పండుగా సాగింది. తొలిరోజైన మంగళవారం 96.56 శాతం మందికి డబ్బులు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 2,60,816 మంది పింఛన్ లబ్ధిదారులు వున్నారు. మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సచివాలయ సిబ్బంది ఆయా లబ్ధిదారుల ఇళ్ల వెళ్లి 2,52,082 మందికి పింఛన్ డబ్బులు అందించారు. ఇంకా 8,734 మందికి పింఛన్‌లు పంపిణీ చేయాల్సి వుంది. వీరంతా ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోవడం, వ్యక్తిగత పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో తొలిరోజు డబ్బులు ఇవ్వలేకపోయామని, వీరికి బుధవారం పింఛన్లు అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా కలెక్టర్ విజయకృష్ణన్ సబ్బవరం మండలం అమృతపురంలో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

- 7లో

- వర్క్స్ ఈడీ కార్యాలయం ముట్టడి



వర్క్స్ ఈడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

అటవీ అధికారులు ఇష్టారాజ్యం

'శారదా వనం' ప్రారంభానికి స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలకు అందని ఆహ్వానాలు

- ప్రజాప్రతినిధులు లేకుండానే రిబ్బన్ కట్ చేసిన అధికారులు
- ప్రొటోకాల్‌కు తూట్లు
- సీఎం, డిప్యూటీ సీఎంలకు ఫిర్యాదు చేసే యోచనలో జనసేన, బీజేపీ నాయకులు



శారదా వనం టికెట్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి (ఫైలు ఫోటో)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అటవీ శాఖ అధికారులు ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కారు. అనకాపల్లి నియోజకవర్గం పరిధిలోని కశింకోట మండలం బయ్యవరం పంచాయతీలో 'శారదా ఉద్యాన వనం' ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు, ఎంపీ సీఎం రమేశ్‌లను ఆహ్వానించలేదు. అటవీ శాఖ విశాఖపట్నం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఎస్.శ్రీకంఠనాథరెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి జగన్నాథ సింగ్‌తో కలిసి రిబ్బన్ కట్ చేశారు. కోటిన్నర రూపాయలతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడంపై కూటమి నేతల్లో చర్చ జరుగుతున్నది.

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అటవీశాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి నియోజకవర్గంలో 120 ఎకరాల్లో 'శారదా వనం' పేరుతో చెట్లపెంపకం కార్యక్రమాన్ని చేపట్టింది. తొలి దశ పనులకు మంజూరైన రూ.1.4 కోట్లతో శారదా వనం వద్ద ప్రవేశ ద్వారం, టికెట్ కౌంటర్ నిర్మించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆధ్వర్యంలో అటవీ శాఖ చేపడుతున్న 'శారదా వనం' తొలిదశ పనుల ప్రారంభోత్సవానికి అటవీ శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఆహ్వానించలేదు. కనీసం స్థానిక ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలకు కూడా సమాచారం ఇవ్వలేదు. అటవీ శాఖ విశాఖపట్నం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఎస్.శ్రీకంఠనాథరెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి జగన్నాథ సింగ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అటవీశాఖ అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించడాన్ని జనసేన, బీజేపీ నాయకులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం వారిని అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారి ఒకరు ఉద్దేశపూర్వకంగానే ఎంపీ, ఎమ్మెల్యేలను పక్కన పెట్టి, ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కిన వైనాన్ని సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. కాగా ప్రొటోకాల్ పాటించకుండా శారదా వనాన్ని ప్రారంభించడంపై జిల్లా ఇన్‌చార్జి అటవీ శాఖాధికారి సునీల్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, తమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, వనంలో ఇంకా పూర్తిస్థాయిలో పనులు జరగలేదన్నారు.



శారదా వనం ముఖద్వారం

గోతిలో దిగబడిన లారీ

గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్

- కొత్తకోటలో తరచూ సంఘటనలు



గోతిలో కూరుకుపోయిన లారీ (ఇన్‌సెట్‌లో) బయటకు తీస్తున్న ఎక్స్‌కవేటర్లు

రావికమతం, అక్టోబరు 1: అత్యంత దారుణంగా తయారైన భీమిలి-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో వాహనదారులకు అవస్థలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా రావికమతం మండలంలో పలుచోట్ల భారీ గోతులు ఏర్పడి, సరకు రవాణా వాహనాలు కూరుకుపోతున్నాయి. మంగళవారం ఉదయం నర్సీపట్నం నుంచి రావికమతం వైపు లోడుతో వస్తున్న లారీ కొత్తకోట హైస్కూల్ వద్ద గొయ్యిలో కూరుకుపోయింది. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కొత్తకోట ఎస్ఐ శ్రీనివాసరావు వచ్చి రెండు ఎక్స్‌కవేటర్‌లను రప్పించారు. వీటి సహాయంతో లారీని బయటకు తీయించారు. ఇదే గొయ్యిలో గత వారం రోజుల్లో మూడు వాహనాలు కూరుకుపోయాయి. వర్షాలు పడకపోయినప్పటికీ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వాడుక నీరు ఈ గోతుల్లో చేరుతున్నది. రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు ఎప్పుడు పునఃప్రారంభం అవుతాయో చెప్పలేని పరిస్థితిలో ఆర్‌అండ్‌బీ అధికారులు వున్నారు. అప్పటిలోగా కనీసం గోతులైనా పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

వృథాగా భవనాలు.. బాలికల వెతలు

గత టీడీపీ హయాంలో సబ్బవరం, రాంబిల్లిల్లో బాలికల హాస్టళ్ల మంజూరు

- ఒక్కోదానికి రూ.2 కోట్ల నిధులు
- చివరి దశలో పనులు.. మారిన ప్రభుత్వం
- ఐదేళ్లపాటు నిరుపయోగంగా ఉంచిన వైసీపీ పాలకులు
- కూటమి ప్రభుత్వంపైనే విద్యార్థినుల ఆశలు

సబ్బవరం/ రాంబిల్లి, అక్టోబరు 1:

తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో చదువున్న బీసీ బాలికల కోసం నిర్మాణం చేపట్టిన వసతిగృహాలను వైసీపీ ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురాకుండా ఐదేళ్లపాటు వృథాగా వుంచేసింది. సబ్బవరంలోని హాస్టల్ భవనంలో ఫ్లోరింగ్, కరెంటు, నీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తే వందలాది మంది బాలికలకు వసతి కల్పించవచ్చు. రాంబిల్లిలోని హాస్టల్ భవనం నాలుగేళ్ల క్రితమే పూర్తికాగా, వినియోగంలోకి తీసుకురాకపోవడంతో పాడైపోతున్నది.



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన బీసీ బాలికల హాస్టల్ భవనం

సబ్బవరంలోని ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న స్థానికేతరులైన (సబ్బవరానికి ఐదు కిలోమీటర్ల పైబడి దూరం) బీసీ బాలికలు, యువతుల కోసం 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హాస్టల్ భవనం నిర్మించాలని నిర్ణయించింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పథకం కింద రూ.2 కోట్లు మంజూరు చేసింది. స్థానిక హైస్కూల్ ఆవరణలో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. భవన నిర్మాణం పూర్తయ్యే సమయానికి ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటికి ఫ్లోరింగ్, విద్యుత్తు, ఇతర మౌలిక సదుపాయాల పనులు మిగిలి ఉన్నాయి.రూ.50 లక్షలు కేటాయిస్తే ఈ పనులు పూర్తవుతాయి. కానీ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. నాడు శంకుస్థాపన చేసి, భవన నిర్మాణ పనులు చేపట్టిన టీడీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలో వుండడంతో నిధులు మంజూరు చేసి, హాస్టల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావలని విద్యార్థినులు కోరుతున్నారు.



రాంబిల్లిలో నిరుపయోగంగా వున్న బీసీ బాలికల వసతిగృహం

రాంబిల్లిలో..

రాంబిల్లి హైస్కూల్ ఆవరణలో 2019 జనవరి 29వ తేదీన అప్పటి ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బాలికల వసతిగృహం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రీయ మాధ్యమిక్ శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) ఫేజ్-5 కింద కోటి 94 లక్షల 21 వేల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఐదు నుంచి 10వ తరగతివరకు చదువుతున్న స్థానికేతరులైన బాలికలకు ఇక్కడ వసతి కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. అదే ఏడాది వైసీపీ అధికారంలోకి వచ్చేనాటికి చాలా వరకు పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తిచేయకుండా భవనాన్ని గాలికొదిలేసింది. ఐదున్నరేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం హాస్టల్ భవన నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం ఆ పార్టీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వున్నందున బాలికల వసతిగృహం పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మద్యం దుకాణాలు బంద్

సిబ్బంది ఆకస్మిక సమ్మె

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

- 5వ తేదీన చర్చలకు ఆహ్వానించిన ఎక్సైజ్ కమిషనర్
- సాయంత్రం తరువాత సమ్మె విరమణ
- తెరుచుకున్న మద్యం దుకాణాలు

అనకాపల్లి/ నర్సీపట్నం అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది మంగళవారం సమ్మెకు దిగారు. దుకాణాలను తెరవకుండా ఆందోళన చేశారు. దీంతో ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకాలు నిలిచిపోయాయి.



అనకాపల్లిలో మద్యం దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న సిబ్బంది

గత వైసీపీ ప్రభుత్వం సొంతంగానే మద్యం వ్యాపారం చేపట్టిన విషయం తెలిసిందే. అప్పట్లో ఒక్కో మద్యం దుకాణంలో ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్, ఒక వాచ్‌మన్ కలిపి నలుగురిని తాత్కాలిక భృతిపై నియమించింది. వీరి కాంట్రాక్టు గడువు సెప్టెంబరుతో ముగిసింది. మరోవైపు కూటమి ప్రభుత్వం మద్యం అమ్మకాలను గతంలో మాదిరిగా ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించి కొత్త మద్యం పాలసీని ప్రకటించింది. ఇప్పటి వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని 151 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సుమారు 750 మంది సిబ్బంది మద్యం దుకాణాలను తెరవలేదు. ఆయా దుకాణాల ఎదుట ఆందోళన చేశారు. దీంతో జిల్లా అంతటా (రెస్టారెండ్ అండ్ బార్లు మినహా) మద్యం అమ్మకాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధి అరవింద్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ కారణంగా తాము జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన జీవో ప్రకారం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందిని పది రోజులపాటు కొనసాగించి తరువాత నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారని అన్నారు. కరోనా సమయంలో కూడా మద్యం దుకాణాల్లో పనిచేశామని, తమ కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

5వ తేదీన చర్యలకు ఆహ్వానం.. సమ్మె విరమణ

ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది సమ్మెకు దిగిన విషయం తెలుసుకున్న ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు, మద్యం దుకాణాల ఉద్యోగుల సంఘ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ నెల ఐదో తేదీన అమరావతిలో చర్చలు జరపడానికి రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ అంగీకరించారు. దీంతో మద్యం దుకాణాల సిబ్బంది సాయంత్రం సమ్మె విరమించి ఐదు గంటల తరువాత దుకాణాలను తెరిచి మద్యం అమ్మకాలు సాగించారు.

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1: పట్టణానికి ఆనుకుని ఉన్న సత్యనారాయణపురం రైల్వే అండర్ పాస్ సమీపంలో మంగళవారం గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు. ఇతనికి 35-40 సంవత్సరాల వయసు వుంటుందని, సుమారు 5.7 అడుగులు ఎత్తు ఉన్నాడన్నారు. తెలుపురంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, బ్రౌన్‌కలర్ కట్ బనియన్ ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి చేతికి పూసలతో కూడిన కాషాయరంగు తాడు ఉందని, సంఘటనా స్థలంలో ఇతర ఆధారాలు ఏమీ లభించలేదన్నారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు.

బిడ్డతో సహా తల్లి అదృశ్యం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 : పట్టణానికి ఆనుకుని ఉన్న కొత్తూరు పంచాయతీ దేవీనగర్‌కు చెందిన మహిళ తన కుమార్తెతో సహా అదృశ్యమైనట్టు మంగళవారం ఫిర్యాదు అందిందని పట్టణ ఎస్‌ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. కాండ్రేగుల శివ సాయికుమార్ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య సౌజన్య సోమవారం సాయంత్రం శివ సాయికుమార్‌కు ఫోన్ చేసి, కుమార్తెతోసహా (4 ఏళ్లు) ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్టు చెప్పింది. దీంతో శివసాయికుమార్ హుటాహుటిని ఇంటికి వచ్చాడు. అప్పటికే భార్య, కుమార్తె వెళ్లిపోయారు. పలుచోట్ల వెతికినా జాడ కనిపించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

సింహాద్రి ఎన్టీపీసీలో కార్మికుడి మృతి

» అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



పడాల నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

పరవాడ, అక్టోబరు 1 : సింహాద్రి ఎన్టీపీసీలో మంగళవారం కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి సీఐ జి.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలపాక పంచాయతీ మూలస్వయంభూవరం గ్రామానికి చెందిన పడాల నాగేశ్వరరావు(55) సింహాద్రి ఎన్టీపీసీలోని సీహెచ్‌పీ-1లో మోనిసా ఎరెక్టర్స్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ తరపున కొంతకాలం నుంచి కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం జనరల్ షిఫ్టుకు వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడడంతో తోటి కార్మికులు సీపీఆర్ చేసి ఎన్టీపీసీకి చెందిన ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. నాగేశ్వరరావుకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని, మృతుడిఇ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కాగా పడాల నాగేశ్వరరావు కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు.

నాలుగు ఇసుక లారీలు పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు

నక్కపల్లి, అక్టోబరు 1: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను మండలంలోని వేంపాడు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి అచ్యుతాపురానికి ఇసుక రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. లారీను పోలీసుస్టేషన్‌కు తరలించి అపరాధ రుసుము విధించినట్టు ఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన బాలికలు

ఎస్.రాయవరం, అక్టోబరు 1: మండలంలోని పెదగుమ్మలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్-17 జిల్లాస్థాయి వాలీబాల్ బాలురు, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. తొలుత ఈ పోటీలను టీడీపీ సీనియర్ నాయకులు వై.నవీన్‌రాజు, అల్లు నరసింహమూర్తి, ఆదర్శ విద్యాసంస్థల అధినేత సీతారామరాజు ప్రారంభించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 15 బాలురు, 15 బాలికల జట్లు పాల్గొన్నాయి. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరిని మాజీ ఎంపీపీ యేజర్ల వినోద్‌రాజు అభినందించారు. త్వరలో విజయనగరంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని పెదగుమ్మలూరు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మల తెలిపారు.

బ్యాడ్మింటన్ ఛాంపియన్ ఎలమంచిలి ఎస్‌జీఏ డిగ్రీ కళాశాల



విజేతలతో ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి విజయ్‌మోహన్ తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 1: ఏయూ స్పోర్ట్సు బోర్డు నిర్వహించిన అంతర్ కళాశాలల పురుషులు, మహిళల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఎంవీపీ కాలనీ జీవీఎంసీ ఎస్ 3 స్పోర్ట్సు ఎరీనాలో జరిగిన ఈ టోర్నీ పురుషుల విభాగంలో ఎలమంచిలి ఎస్‌జీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ స్థానం సాధించగా, అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఏయూ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల కేటగిరీలో ఎలమంచిలి ఎస్‌జీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శృంగవరపు కోట, ఏయూ డాక్టర్ అంబేడ్కర్ లా కళాశాల తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ సమన్వయకర్త డాక్టర్ వై.పోలిరెడ్డి, డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వాసుదేవరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

దుర్గమ్మ విగ్రహాలకు తుది మెరుగులు

శరన్నవరాత్రి ఉత్సవాలతో బొమ్మల తయారీ కళాకారులు బిజీ

» గొర్లివానిపాలెంలో భారీ ఎత్తున విగ్రహాలు తయారీ

» రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్మకం



విగ్రహాలకు రంగులు వేస్తున్న కళాకారుడు

పరవాడ, అక్టోబరు 1: శరన్నవరాత్రి ఉత్సవాలు రెండు రోజుల్లో ప్రారంభం కానుండడంతో దుర్గాదేవి విగ్రహాలకు తయారీదారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. మండలంలోని గొర్లివానిపాలెంలో వినాయకుడు, దుర్గాదేవి, ఇతర దేవతామూర్తుల విగ్రహాలను ఆకట్టుకునేలా తయారు చేసే కళాకారులు వున్నారు. దీంతో మండలంలోని పలు గ్రామాలతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి కూడా భక్తులు ఇక్కడకు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు సుమారు నెల రోజుల ముందే ఆర్డర్లు ఇచ్చి విగ్రహాలు తయారు చేయించుకుంటున్నారు. పెదగంట్యాడ, గాజువాక, అగనంపూడి, కూర్మన్నపాలెం, అచ్యుతాపురం నుంచి కూడా విగ్రహాల కోసం వస్తుంటారు. రెండు అడుగుల నుంచి ఏడున్నర అడుగుల వరకు విగ్రహాలను తయారు చేస్తున్నారు. విగ్రహాల పరిమాణాన్ని బట్టి రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్ముతున్నారు. విగ్రహాల తయారీదారుడైన అనకాపల్లి శివ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, ఐదేళ్ల నుంచి దుర్గాదేవి విగ్రహాలను తయారు చేస్తున్నట్టు చెప్పారు. దసరాకు రెండు నెలల ముందు విగ్రహాల తయారీ పనులు మొదలు పెడతామన్నారు. విగ్రహాల తయారీకి అవసరమైన ముడిసరకులను రాజస్థాన్, పుణె, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. తనతోపాటు మరో పది మంది కళాకారులు విగ్రహాలను తయారు చేస్తుంటామని ఆయన చెప్పారు.



విక్రయానికి సిద్ధం చేసిన దుర్గాదేవి విగ్రహాలు

పూడిమడక మత్స్యకారులు హ్యాపీ!

» గేలాలకు చిక్కిన కచ్చిలి చేపలు

» పది రోజుల తరువాత సంతృప్తికరంగా వేట



రూ.30 వేలు పలికిన కచ్చిలి చేపలు



మత్స్యకారులు విక్రయిస్తున్న అభిలాష రకం చేపలు

అచ్యుతాపురం, అక్టోబరు 1: సుమారు వారం రోజుల తరువాత సముద్రంలో వేటకు వెళుతున్న పూడిమడక మత్స్యకారులకు భారీగానే చేపలు లభిస్తున్నాయి. గ్రామంలో సుమారు 700 బోట్లుండగా మంగళవారం ఉదయం సుమారు 300 బోట్లు చేపల వేటకు వెళ్లాయి. అన్ని గేలాలకు 'అభిలాష' అనే చేపలతోపాటు కచ్చిలి చేపలు కూడా చిక్కాయి. బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడనాల కారణంగా సెప్టెంబరు 21 నుంచి పూడిమడక మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లడం లేదు. వర్షాలు ఆగిపోవడం, వాతావరణం అనుకూలంగా మారడంతో ఆదివారం నుంచి చేపల వేటకు వెళుతున్నారు. రెండు రోజుపాటు ఆశాజనంగా వేట సాగలేదు. చిన్నపాటి చేపలు పడడంతో నిరాశ చెందారు. అయితే మంగళవారం వేటకు వెళ్లిన అన్ని బోట్లకు చేపలు పడ్డాయి. అందరికీ 'అభిలాష' రకం చేపలు పడడం విశేషం. ఒక్కొక్క బోటుకు పది చేవలు వరకు చిక్కాయి. వ్యాపారులు కిలో వంద రూపాయల చొప్పున కొనుగోలు చేశారు. ఒక మత్స్యకారుని గేలాలకు నాలుగు కచ్చిలి/బంగారు పాప చేపలు పడ్డాయి. వ్యాపారులు వీటిని రూ.30 వేలకు కొనుగోలు చేశారు.

సైద్ధాంతిక మానవతావాది ఏచూరి

సంస్మరణ సభలో కొనియాడిన వక్తలు



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కొణతాల రామకృష్ణ. పక్కన దాడి వీరభద్రరావు, పీలా గోవింద, లోకనాథం తదితరులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1: సైద్ధాంతిక విలువలు పాటిస్తూనే ఇతర రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు నెరపిన మానవతావాది సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన వాదనలు ఇతర పార్టీలు కూడా కాదనలేనంత సహేతుకంగా ఉండేవన్నారు. దివంగత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ మంగళవారం ఇక్కడ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ఏచూరి చిత్రపటానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పూలమాల వేయగా, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ, యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు, అనేక ప్రజా అనుకూల చట్టాలు రావడం వెనుక ఏచూరి కృషి ఉందన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం, విశాఖ రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాలకు సహకరించారని గుర్తు చేశారు. విశాఖపట్నంలో సీతారాం ఏచూరి విగ్రహం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ, సీతారాం ఏచూరి దేశ రాజకీయాల్లో ముఖ్య పాత్ర నిర్వహించారన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ఏచూరి వంటి మహానాయకులను నేటి తరం రాజకీయ నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా చట్టసభల్లో, బయట ఏచూరి నిరంతరం పోరాడారని అన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా తుది శ్వాస విడిచే వరకు పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మీసాల సుబ్బన్న, టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, ఇతర పార్టీలకు చెందిన జి.కోటేశ్వరరావు, రాజాన దొరబాబు, కె.హరిబాబు, వైఎన్ భద్రం, అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎన్ కుమార్, యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భరిణికాన సాయినాథరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల ఆందోళన



వర్క్స్ ఈడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. వర్క్స్ ఈడీ కార్యాలయాన్ని ముట్టడించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో పాటు పోలీసులు భారీగా మోహరించారు. ప్లాంటులో సుమారు 14 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉండగా వారిలో నాలుగు వేల మందిని ఆపేయాలని యాజమాన్యం గత శనివారం నిర్ణయించింది. ఈ మేరకు వారి వివరాలను బయోమెట్రిక్ యంత్రాల నుంచి తొలగించింది. దాంతో కార్మికులు ఆదివారం పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి వెంటనే తొలగించకుండా చర్యలు చేపట్టింది. కార్మికులు శాంతించారు. అయితే కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలలకొకసారి పసుపు రంగు కార్డులు (గేట్ పాస్) ఇస్తారు. తొలగించాలని నిర్ణయించిన వారి నుంచి ఆ కార్డులను వెనక్కి తీసుకున్నారు. వాటి స్థానంలో కొత్తగా తెలుపు కార్డులు ఇవ్వాలని భావిస్తున్నారు. వాటిని రెన్యువల్ చేయకుండా కొద్దికాలం తరువాత వారిని పూర్తిగా నిలిపివేయాలని యాజమాన్యం భావిస్తోంది. ఈ విషయం బయటకు పొక్కడంతో మంగళవారం కాంట్రాక్టు కార్మికులు కుటుంబాలతో సహా వచ్చి వర్క్స్ ఈడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇది రాత్రి వరకు కొనసాగింది. ఏ ఒక్కరిని తొలగించినా ఊరుకోబోమని, అందరినీ కొనసాగించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం వస్తుంది. వీరిలో స్టీల్‌ప్లాంటు నిర్మాణానికి భూములు ఇచ్చిన నిర్వాసితులు కూడా ఉన్నారు.

కైలాసగిరిపై సాహస క్రీడలు

జిప్ లైనర్, స్కై సైక్లింగ్‌కు ఏర్పాట్లు

» ఇప్పటికే టవర్ల నిర్మాణం పూర్తి

» రెండు, మూడు రోజుల్లో ట్రయల్ రన్

» దసరా నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్న అధికారులు



స్కై సైక్లింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పర్యాటకులకు దసరా కానుక సిద్ధం చేస్తోంది. కైలాసగిరిపై అడ్వంచర్ స్పోర్ట్స్‌లో భాగంగా స్కై సైక్లింగ్, జిప్ లైనర్లను ఏర్పాటు చేస్తోంది. రెండేళ్ల క్రితమే వీటికి సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరినా పనులు ముందుకుసాగలేదు. ఇటీవల కమిషనర్‌గా వచ్చిన విశ్వనాథన్ పాత వాటిని సమీక్షించి, ఆయా పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టారు. దాంతో ఈ రెండింటి పనులు ఊపందుకున్నాయి. వీటి కోసం వీఎంఆర్‌డీఏ రూపాయి కూడా పెట్టుబడి పెట్టడం లేదు. కేవలం కొండపై రెండు వేల గజాల స్థలం మాత్రమే కేటాయించింది. కేరళలో జిప్ లైనర్, స్కై సైక్లింగ్ ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహిస్తున్న ఓ సంస్థ, విశాఖపట్నానికి చెందిన సాయి మోక్ష షిప్పింగ్ ఏజెన్సీ కలిసి జాయింట్ వెంచర్ కింద ఈ ప్రాజెక్టు చేపట్టాయి. వ్యయం అంతా అవే భరిస్తాయి. అందులో వచ్చే ఆదాయంలో 45 శాతం వీఎంఆర్‌డీఏకు ఇస్తాయి. కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహం వద్ద నుంచి విశాలాక్షి నగర్ వైపు 150 మీటర్ల పొడవున ఈ జిప్ లైనర్, స్కై సైక్లింగ్ వస్తాయి. అలాగే స్కై సైక్లింగ్ అందుబాటులోకి రానున్నది.

టికెట్ ధరపై నిర్ణయం కమిషనర్‌దే

ఈ తరహా జిప్ లైనర్లు, స్కై సైక్లింగ్‌లకు కేరళలో మనిషికి రూ.150 చొప్పున టికెట్ పెట్టి వసూలు చేస్తున్నారు. ఇక్కడ టికెట్ ధర ఎంత అనేది వీఎంఆర్‌డీఏ కమిషనరే నిర్ణయిస్తారని ఈ పనులు పర్యవేక్షిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బలరామరాజు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ట్రయల్ రన్ నడిపి, దసరా నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు.

చెక్కపై గాంధీజీ రూపం



సూక్ష్మకళాకారుడు దార్ల రవి చెక్కతో రూపొందించిన గాంధీజీ రూపం

నక్కపల్లి, అక్టోబరు 1: మండలంలోని చినదొడ్డిగొల్లు గ్రామానికి చెందిన సూక్ష్మకళాకారుడు దార్ల రవి ప్రత్యేక సందర్భాల్లో తన కళా నైపుణ్యతను ప్రదర్శించి అద్భుత కళాఖండాలను తయారు చేస్తున్నాడు. తాజాగా అక్టోబరు రెండో తేదీ గాంధీ జయంతి సందర్భంగా చెక్కపై గాంధీజీ రూపంతో పాటు రెండో తేదీని అంకె రూపంలో చక్కగా చెక్కాడు.

పకడ్బందీగా టెట్

» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్)ను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. టెట్ నిర్వహణపై మంగళవారం ఆమె వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్టోబరు 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అనకాపల్లిలోని ఒక కేంద్రంలో టెట్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక పరీక్ష, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో పరీక్ష జరుగుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షకు డిపార్టుమెంట్ అధికారిగా పరవాడ ఎంఈవో సాయిశైలజను నియమించామన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారులకు చెప్పారు. డీఈఓ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు వుంటే 9441238141, 9490462025, 9177042789 నంబర్లకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో కలెక్టర్

సబ్బవరం, అక్టోబరు 1: మండలంలోని అమృతపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొంతమంది లబ్ధిదారులకు ఆమె పింఛన్ డబ్బులు అందించారు. సాయంత్రంలోగా ప్రతి ఒక్కరికీ పింఛన్ సొమ్ములు పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ, మండలంలో 8,183 మంది పింఛన్‌దారులు సాయంత్రానికి 8053 (98.34 శాతం) మందికి అందజేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచామచి చెప్పారు. అందుబాటులోలేని 130 మందికి బుధవారం పింఛన్ డబ్బులు అందజేస్తామని చెప్పారు.

రైతులకు అండగా ప్రభుత్వం

సబ్బవరం, అక్టోబరు 1: రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నాణ్యమైన పంటలు పండించి, అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మండలంలో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన ఇ-క్రాప్ నమోదును మంగళవారం తవ్వవానిపాలెంలో ఆమె పరిశీలించారు. పంటలు సాగు చేసే రైతులంతా విధిగా ఇ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాల లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, అనకాపల్లి ఏడీ ఎం.రామారావు, ఏవో పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు, సర్పంచ్ బోకం స్వామినాయుడు, డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు, ఆర్ఐ వీరయ్య వున్నారు.

చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా వెంకటేశ్వరరావు



వెంకటేశ్వరరావు

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 1: ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నర్సీపట్నానికి చెందిన మాసిన వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ప్రతినిధుల పర్యవేక్షణలో నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెస్ క్రీడాభివృద్ధిపై దృష్టి సారిస్తానని అన్నారు.

హోంగార్డు కుటుంబానికి పోలీస్ శాఖ బాసట



నియామక పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

తుమ్మపాల, అక్టోబరు 1: స్టీల్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన హోంగార్డు పైలా అప్పలనాయుడు కుటుంబానికి పోలీస్ శాఖ బాసటగా నిలిచింది. కారుణ్య నియామకం కింద అప్పలనాయుడు కుమారుడు శ్రీనివాస్‌కు హోంగార్డుగా ఉద్యోగం ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాన్ని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అందజేశారు.

పల్లాను కలిసిన కార్పొరేషన్ చైర్మన్లు



పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న తాతయ్యబాబు, పీలా గోవింద

బుచ్చెయ్యపేట, అక్టోబరు 1 : రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ పల్లాను శాలువాలు కప్పి, గజమాలతో సత్కరించారు.

రాష్ట్ర స్థాయి గుర్రాల పోటీలో విజేత కోటనందూరు రాకీ

నాతవరం, అక్టోబరు 1: నాతవరం మండలం డియ్యవరంలో నల్లకొండమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి గుర్రాల పోటీల్లో కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన రాకీ ప్రథమస్థానం సాధించి విజేతగా నిలిచారు. అలాగే రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం వైజాగ్ మణి, తృతీయస్థానం పెద్దాపురం గుర్రాల శ్రీనుకు లభించాయి. ప్రథమ స్థానానికి రూ.15 వేలు, ద్వితీయ స్థానానికి రూ.12 వేలు, తృతీయస్థానానికి రూ.10 వేల చొప్పున ఉత్సవ కమిటీ నిర్వాహకులు బెన్నయ్యనాయుడు అందజేశారు. ఈ గుర్రాల పరుగు పోటీలను నర్సీపట్నం కౌన్సిలర్ చింతకాయల రాజేష్ స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. నల్లకొండమ్మతల్లి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సీఎం సహాయ నిధికి విద్యార్థుల విరాళం

కశింకోట, అక్టోబరు 1: మండలంలోని తాళ్ల పాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రూ.22,330 ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు సేకరించారు. ఈ విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి డీడీ తీసి పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ కరణం శ్రీనివాసరావులకు అందజేశారు.

మహిళలు రక్షణ రంగంలో రాణించాలి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1: మహిళలు రక్షణ రంగంలో కూడా రాణించాలని హెచ్‌ఎం కె. రుధిర రాణి కోరారు. స్థానిక జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం వీర్‌గాథ 4.0 పేరిట నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సైనిక ఉద్యోగులు బలిరెడ్డి ప్రకాశరావు, జయచంద్ర మోహన్, ఉపాధ్యాయులు కె. రమాదేవి, రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన


అనకాపల్లి టౌన్, అక్టోబరు 1: స్థానిక డాక్టర్ హిమశేఖర్ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రస్తుతం సమాజంలో చట్టాల ప్రాముఖ్యతను వివరించారు. మహిళా ఎస్ఐ రాములమ్మ మాట్లాడుతూ పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.సౌజన్య, ప్రిన్సిపాల్ పి.సురేష్ పాల్గొన్నారు.


అగ్నివీర్‌కు ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంపిక


కొత్తూరు, అక్టోబరు 1 : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఐదుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు అగ్నివీర్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు మంగళవారం తెలిపారు. ఎంపికైన క్యాడెట్లు పి.మహేంద్ర, సతీష్, కె.రవితేజ, డి.లోకేష్, బి.చందులను అభినందించారు. ఎంపికైన కేడెట్లకు రూ.2వేలు మేనేజ్‌మెంటు స్కాలర్‌షిప్‌ను కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్‌కుమార్, సూపరింటెండెంట్ పెంటకోట అనురాధ, ఎన్‌సీసీ కెప్టెన్లు దాడి జగదీష్, ఏఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థకు విరాళం

పాయకరావుపేట, అక్టోబరు 1: స్థానిక చిత్ర మందిర్ థియేటర్ వద్ద మంగళవారం నందమూరి కల్చరల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చింతకాయల రాంబాబు, ప్రెసిడెంట్ విశ్వనాథుని శ్రీను మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ సభ్యులు పెదిరెడ్డి ప్రసాద్, పెదిరెడ్డి చిట్టిబాబు, చైర్మన్ బాలేపల్లి నబాబులకు రూ.5 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి వెంకటరామకృష్ణ, మొల్లేటి నారాయణ మూర్తి, వెలుగుల అర్జునరావు, గదుల అచ్చిబాబు, బత్తిన గోవిందు, దువ్వ శ్రీను పాల్గొన్నారు.







పండుగలా పింఛన్ల పంపిణీ

ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యేలు, కూటమి నేతలు..

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 : పట్టణంలో మంగళవారం పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది. తెల్లవారు జామునే సచివాలయ ఉద్యోగులు వారి పరిధిలో పెన్షన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. స్థానిక భీమునిగుమ్మం, మళ్లవీధి ప్రాంతాల్లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని ఐదు వార్డుల్లో కూడా కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, సబ్బవరపు గణేష్, బొద్దపు ప్రసాద్, కాయల ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 9,907 మంది లబ్ధిదారులు ఉండగా 9,661 మందికి పింఛన్లు పంపిణీ చేశారు.

ఎలమంచిలిలో.. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పెంపుతో పేదల జీవితాల్లో వెలుగులు నింపినట్టయిందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం మునిసిపాలిటీ కాకివానివీధిలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కూటమి నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కొఠారు సాంబ, రాజాన శేషు, కొఠారు నరేష్, మజ్జి రామకృష్ణ, కొనగళ్ల రామకృష్ణ, వై. చిరంజీవి, ఆడారి రమణబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అనకాపల్లి టౌన్: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు

అచ్యుతాపురం రూరల్‌లో.. ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్ ద్వారా అనేక మంది జీవితాలకు భద్రత చేకూరుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కొండకర్ల, చీమలాపల్లి గ్రామాల్లో ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుడివాడ జయకుమార్, మామిడి శివ అప్పారావు, శ్యామల రాజు, దాసరి నర్సింగరావు, కట్టుమూరి చిట్టేశ్వరరావు, కోసూరి ఈశ్వరరావు, పెయ్యిల గిరి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలో పలు గ్రామాల్లో లబ్ధిదారులకు కూటమి నేతలు ఉదయం 6 గంటల నుంచి పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. కృష్ణంపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు వి.దిన్‌బాబు, టీడీపీ నాయకుడు కశిరెడ్డి ప్రసాద్, కొత్తపట్నం, గోవిందపాలెం, కొత్తపేట గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, జనసేన మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.


ఎలమంచిలి మునిసిపాలిటీలోని కాకివానివీధిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్


అచ్యుతాపురం రూరల్: చీమలాపల్లిలో పెన్షన్ అందజేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

ప్రేమ సమాజంలో వృద్ధుల దినోత్సవం

ఎలమంచిలి, అక్టోబరు 1: స్థానిక కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో మంగళవారం వృద్ధుల దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ పాల్గొని వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులందరికీ ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఎలమంచిలి న్యాయ సేవా అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ డి. వెంకటరావు, బార్ అసోసియేషన్ సెక్రటరీ బి. హరి శంకరరావు, ఉపాధ్యక్షుడు పెరుమాళ్ల వెంకట రమణ, ప్యానల్ న్యాయవాది టి.నూకరాజు, ఆశ్రమ ప్రతినిధి స్వామి రామకృష్ణ పాల్గొన్నారు.

తాళ్లపాలెం పీహెచ్‌సీలో..

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి యు.రమేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ. ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి ఏవీ.సుబ్బారావు, సూపర్‌వైజర్ కేఎస్‌ఆర్‌కే.నరసింహారావు, ఏఎన్ఎం.లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా బయ్యవరం సన్నీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 100 మంది వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్గాల శ్రీనివాసరావు, యూత్‌క్లబ్ సభ్యులు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి ప్రసాద్, గొన్నా ఆదిరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రేమ సమాజంలో వృద్ధులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ

జలగలమదుం రహదారి పనులు ప్రారంభం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1: సుంకరమెట్ట జంక్షన్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో గత కొంతకాలంగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చొరవ తీసుకుని స్థల బాధితులతో ఇటీవల చర్చించారు. ఆయన ఇచ్చిన భరోసా మేరకు రోడ్డు నిర్మాణానికి స్థలం కోల్పోతున్న వారు కూడా అంగీకరించడంతో మంగళవారం నుంచి రోడ్డు నిర్మాణ పనులను జీవీఎంసీ అధికారులు ప్రారంభించారు. పనులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కొణతాల అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

జిల్లా స్థాయి పోటీలకు కోటవురట్ల విద్యార్థినుల ఎంపిక


ఎంపికైనా కోటవురట్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

కోటవురట్ల, అక్టోబరు 1: స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాయకరావుపేట మండలం ఎస్.నరసాపురం హైస్కూల్‌లో జరిగిన పోటీల్లో 100,200 మీటర్ల పరుగు, లాంగుజంప్, కబడ్డీ పోటీలకు మధు, అక్షయ, హరిని, లాస్యదేవి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. యశస్విని బాల్ బ్యాడ్మింటన్‌కు, 800 మీటర్ల రన్నింగ్ పోటీలకు శ్యామలాదేవి, ఝాన్సీ ఎంపికైనట్టు హైస్కూల్ పీడీ విజయకుమారి తెలిపారు. ఎంపికైనా విద్యార్థులు, పీడీ విజయకుమారిలను హెచ్‌ఎం యేసుబాబు అభినందించారు.

4న ఇసుకపై ఆందోళనను జయప్రదం చేయండి

కశింకోట, అక్టోబరు 1: ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న చేయనున్న రాష్ట్ర వ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఇక్కడ జరిగిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ.. గత 15 ఏళ్ల క్రితం ఇసుక ఏ పద్ధతిలో ఉచితంగా లభించేదో అదే విధంగా వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.మహేష్, అప్పలకొండ, సత్యారావు, తాతబ్బాయి, లోవరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 1: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో జయప్రకాశరావు అన్నారు. మండలంలోని పాల్తేరులో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ చెత్తా, చెదరాలను వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించి చర్యలు తీసుకోవాలన్నారు. పాయకరావుపేట, పాల్మన్‌పేట, సత్యవరం, మంగవరం, పాల్తేరు, ఈదటం గ్రామాలలో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీహెచ్. చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పందూరు సర్పంచ్ నోరు అదుపులో పెట్టుకో : టీడీపీ

కోటవురట్ల, అక్టోబరు 1: పందూరు సర్పంచ్ చికెట్ల జగదీష్ నోరు అదుపులో పెట్టుకోవాలని ఆ గ్రామ టీడీపీ నాయకులు సూచించారు. మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు జానకిశ్రీనివాసరావు ఇంటి వద్ద పందూరు గ్రామ టీడీపీ నాయకులు శానాపతి, అప్పలకొండ, చికెట్ల భాస్కరరావు, రాంబాబు, ఎడ్ల సత్తిబాబు, పాలకొండ రమణ విలేకర్లతో మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్‌గా గౌరవప్రదమైన పదవిలో ఉంటూ మండల సమావేశంలో పందూరు టీడీపీ నాయకులను బ్రోకర్లు అనడం మంచిది కాదని హెచ్చరించారు. హౌసింగ్ కాలనీ ఇళ్లు వస్తే నీకు ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అందరికీ చెప్పే చేశావా అని వారు ప్రశ్నించారు.

వైసీపీ నేతల చేతివాటం

... 5వ పేజీ తరువాయి

చేతికి అందినకాడికి ఇనుము, సిమెంటు దోచుకుపోయారని సమాచారం. రొంగలివానిపాలేనికి చెందిన ఒక వైసీపీ నాయకుడి అండదండలతో సిమెంట్, ఇనుముతోపాటు తమ సొంత సొమ్ముతో కొనుగోలు చేసిన ఇసుక, కంకరను ఎత్తుకుపోయారని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు.. విచారణకు ఆదేశం

అనకాపల్లి మండలం సంపతిపురం, కూండ్రం, రొంగలివానిపాలెం జగనన్న కాలనీల్లో సిమెంట్, ఐరన్ మాయమవడంపై స్థానిక జనసేన నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలించిన కలెక్టర్.. సిమెంట్, ఐరన్ మాయంపై విచారణ చేపట్టి అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ, వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న సదరు వైసీపీ నాయకులు భయాందోళన చెందుతున్నట్టు తెలిసింది.

మద్యం షాపుల ఉద్యోగుల నిరసన

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం ఆందోళన చేపట్టారు. పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి, తమ నిరసన తెలియజేశారు. షాపులు తెరవాలని ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌నాయుడు చర్చించినప్పటికీ ఆందోళనకారులు అంగీకరించలేదు. దీంతో సాయంత్రం నాలుగు గంటల వరకు పట్టణంలోని మద్యం దుకాణాలు మూతపడ్డాయి. అయితే ఎక్సైజ్ ఉన్నతాధికారులు గురువారంలోగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో యథావిధిగా దుకాణాలు తెరిచి అమ్మకాలు సాగించినట్టు అరవింద్, భీమేష్ తెలిపారు.


పరవాడలో.. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం పరవాడలో నిరసన చేపట్టారు. ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త మద్యం పాలసీ విధానం వలన తమ ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుందని వాపోయారు. ఈ కార్యక్రమంలో బి.రవి, నాయుడు, ఎల్. ముత్యాలనాయుడు, ఆదిరెడ్డి సత్యారావు, వర్రి నరసింహమూర్తి, వడిసెల అనోజ్, పైలా లక్ష్మణరావు, నరేష్, గంగునాయుడు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మద్యం దుకాణాల సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం వరకు శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అమలు చేస్తుందని, దీంతో వేలాది మంది సిబ్బంది రోడ్డున పడిపోతామని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్యం దుకాణ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

అచ్యుతాపురం రూరల్‌లో.. మద్యం దుకాణాలు మూసివేయనుండడంతో కారణంగా తాము రోడ్డున పడతామని సంబంధిత ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తాము కొన్నేళ్లుగా ఇదే షాపులో పనిచేస్తున్నామని, తమకు ఏ విధమైన పరిహారం చెల్లించకుండానే నిలిపి వేయడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తమను గుర్తించాలని వారు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందకు సత్కారం

తుమ్మపాల, అక్టోబరు 1 : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను టీడీపీ కార్యకర్తలు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. దుశ్శాలువాలను కప్పి బుద్ధుని చిత్రపటాన్ని అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ కష్టపడి పార్టీలో పనిచేసిన వారికి పార్టీ నిత్యం అండగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో కార్యకర్తలంతా క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పీలాను సత్కరించి బుద్ధుని చిత్రపటాన్ని అందిస్తున్న కార్యకర్తలు

శరన్నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 : స్థానిక నిదానందొడ్డి కామాక్షిదేవి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను చెప్పారు. మంగళవారం అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ నవరాత్రుల్లో ప్రతి రోజు ఒక అవతారంలో అమ్మవారు దర్శనమిస్తారన్నారు. తొమ్మిది, పది, 11 తేదీల్లో రైతుభారతి కల్యాణ మండపంలో సురభి నాటకాలు నిర్వహిస్తామన్నారు. 14న అన్నసమారాధన అనంతరం అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్. సతీష్, కోశాధికారి డి.లక్ష్మణరావు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, ప్రధానకార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల పుస్తకాన్ని ఆవిష్కరించిన చైర్మన్ శ్రీను

హరిపాలెం పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

అచ్యుతాపురం, అక్టోబరు 1: హరిపాలెం పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో ఎం. బాలాజీ మంగళవారం సాయంత్రం సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలను వైద్యాధికారి మానసను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ల్యాబ్‌ని సందర్శించి మలేరియా, టీబీ పరీక్షలు గురించి టెక్నీషియన్ గణేష్‌ని అడిగి, రికార్డులను పరిశీలించారు. అన్ని జాతీయ కార్యక్రమాలను శతశాతం పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు పీహెచ్‌సీలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మానస, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.


హరిపాలెం పీహెచ్‌సీలో ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బాలాజీ

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విద్యార్థి సంఘాల నేతలు దీక్ష

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 : స్థానిక నెహ్రూచౌక్‌లో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శిబిరాన్ని ఉక్కు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ఆర్.దొరబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శివాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి తాము వ్యతిరేకమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర మంత్రితో మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ఓ, డీవైఎఫ్ఐ నాయకులు ఎం.రమణ, ఫణీంద్ర, భాస్కర్, నాని, వి.రాజు, గీతా కృష్ణ, శ్రీను, అప్పలరాజు పాల్గొన్నారు. దీక్షకు ఐద్వా జిల్లా కార్యదర్శి డీడీ. వరలక్ష్మి సంఘీభావం తెలిపారు.


దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం తెలుపుతున్న కొణతాల రామకృష్ణ

పుస్తకాలు పంపిణీ

ఎలమంచిలి, అక్టోబరు 1: మండలంలోని జంపపాలెం జడ్పీ హైస్కూల్‌లో 136 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ అందించిన నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు బీఎస్. బంగారు శెట్టి మాట్లాడుతూ పది పరీక్షల్లో 500 మార్కులు పైబడి సాధించిన వారికి ప్రోత్సాహకాలు అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, లయన్స్‌క్లబ్ సభ్యులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, శాస్త్రి, బొడ్డే సత్యనారాయణ, డాక్టర్ కె. శంకర్ గిరి, కె.సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు పాల్గొన్నారు

అనకాపల్లి తహసీల్దార్‌గా విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1: అనకాపల్లి తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎస్.రాయవరం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ గంగాధర్ జూన్‌లో పదవీవిరమణ చెందడంతో డీటీ వై. శ్రీరామ్మూర్తి ఇప్పటివరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించారు.

నవరాత్రి మహోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

పరవాడ, అక్టోబరు 1: స్థానిక బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాల గోడపత్రికను వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల మూడో తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిరపురపు అప్పలనాయుడు, చుక్క రాము నాయుడు, బండారు రామారావు, చల్లా కనకారావు, పైలా హరీష్, పైలా వెంకటరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి : సీఐ

పరవాడ, అక్టోబరు 1 : ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పరవాడ సీఐ జి. మల్లికార్జునరావు సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నారాయణరావు, లెక్చరర్లు జి. శ్రీధర్, లక్ష్మి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

చందనాడ పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

నక్కపల్లి అక్టోబరు 1: మండలంలోని చందనాడలో ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో డి.సీతారామరాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన తరగతి గదులను, వాష్‌రూమ్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచిపై ఆరా తీశారు.

విస్తరణ పనులు వేగవంతంగా జరగాలి : ఎమ్మెల్యే

అచ్యుతాపురం,అక్టోబరు 1: అచ్యుతాపురం జంక్షన్‌లో విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విస్తరణలో భాగంగా జంక్షన్‌లో కూల్చివేసిన భవనాల ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం కాలువల్లో ఎక్కడా మురికి నీరు ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డుకిరువైపులా విద్యుత్ స్తంభాల మార్పు, కొత్త డ్రైనేజీ ఏర్పాటు గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసు, ద్వారపురెడ్డి బాపూజీ, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

అచ్యుతాపురం, అక్టోబరు 1: అచ్యుతాపురం-అనకాపల్లి రహదారిలో సోమవారం రాత్రి కూలిన భారీ చెట్టుని రాత్రికి రాత్రే తొలగించి ట్రాఫిక్‌ని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి మంగళవారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

డైట్ కళాశాలలో రక్తదాన దినోత్సవం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 : స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ప్రారంభించి, రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఎన్ఎస్ఎస్ పీవో మోహనరావు, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఈశ్వరరావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ కృష్ణనాగు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జూనియర్ కళాశాల విద్యార్థుల ఎంపిక

సబ్బవరం, అక్టోబరు 1 : చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో స్థానిక గురుకుల కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి మురళీధర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో పి.ప్రశాంతి, ఎ.ఆనంద్, కబడ్డీలో డి. మాతాజి ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం వారిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ పీవీఎన్ మూర్తి, పీడీ రమణారావు, అధ్యాపకులు అభినందించారు.

శ్మశానానికి కేటాయించాలి

రాంబిల్లి, అక్టోబరు 1: అధికారులు ఇచ్చిన హామీ మేరకు కొండ వద్ద శ్మశానానికి స్థలాన్ని కేటాయించి, నేవీ ప్రహరీగోడ నిర్మించాలని వైలోవ మాజీ సర్పంచ్ బి.నారాయణరావు, గ్రామ పెద్దలు కోరారు. మంగళవారం వైలోవ గ్రామంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, సీఐ నర్సింగరావు గ్రామ పెద్దలతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొండను ఆనుకొని ఉన్న ఇళ్లకు 10 అడుగుల దూరం నుంచి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, శ్మశాన స్థలాన్ని విడిచిపెట్టాలని కోరారు. అనంతరం సీఐ నర్సింగరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

చెత్త నుంచి పంచాయతీలకు ఆదాయం

అచ్యుతాపురం రూరల్, అక్టోబరు 1 : చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా ఆయా పంచాయతీలకు ఆదాయంతోపాటు గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని డీపీఓ శిరీషారాణి అన్నారు. మండలంలోని ఎం.జగన్నాథపురంలో గల చెత్త నుంచి సంపద కేంద్రాన్ని డీఎల్‌డీఓ మంజులావాణితో కలిసి ఆమె సందర్శించారు. వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ విధానం, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా అందించాలి

రాంబిల్లి, అక్టోబరు 1 : కూటమి ప్రభుత్వం ఇచ్చిన మేరకు ఉచిత ఇసుకను అందించి, ఉపాధి కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పెదకలవలాపల్లి, రాంబిల్లి గ్రామాల్లో మంగళవారం భవన నిర్మాణ కార్మికులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా ఇసుక లేక నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సీహెచ్ రామకృష్ణ, భవన నిర్మాణ సంఘాల నేతలు ఎస్.రాంబాబు, రాము, చినకలవలాపల్లి సర్పంచ్ వై.శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా రమేశ్‌బాబు బాధ్యతలు

ఎస్.రాయవరం, అక్టోబరు 1: మండల తహసీల్దార్‌గా జె. రమేశ్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంవీఎస్ నీరజ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ కె.కోటపాడు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన విజయ్‌కుమార్ అనకాపల్లి బదిలీ అయ్యారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పాయకరావుపేట రూరల్, అక్టోబరు1: మండలంలోని గుంటపల్లి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం కాకినాడ సంకు రాత్రి ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి. రామారావు, ఉపాధ్యాయులు నాగూర్, సుధాకర్, శ్రీనివాసరావు, రవిబాబు, రాజుబాబు, రాంగోపాల్, శ్యామ్, వెంకన్న, కిరణ్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవీనవరాత్రుల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

మాడుగుల, అక్టోబరు 1 : మాడుగుల కేంద్రంలో ఈ నెల 3 నుంచి నిర్వహించనున్న దేవీనవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను మంగళవారం స్థానిక దేవి ఆడిటోరియంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. మంగళవారం ఆయన దేవి ఆడిటోరియంలో గల దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు శ్రీనాథ శ్రీనివాసరావు, అధ్యక్షుడు శ్రీనాథ వెంకట కొండలరావు, ఉపాధ్యక్షుడు సతీష్, కార్యదర్శి ఇళ్లపు రమణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ వేషధారణలో అలరించిన విద్యార్థులు



గాంధీజీ వేషధారణలో విద్యార్థులు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 1 : మానవాళి చరిత్రలో ఒక సమున్నత శిఖరం మహాత్మ గాంధీ అని ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. గాంధీ జయంతి నేపథ్యంలో మంగళవారం కందిపూడిలో పలువురు విద్యార్థులు గాంధీ వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో మాట్లాడుతూ గాంధీ ఆశయాలు ఎప్పటికీ ఆచరణీయం అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సత్యారావు, సర్పంచ్ సత్యవతి, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, కార్యదర్శి బి.దేముడుబాబు, మండల నాయకులు బి.శేషకుమార్, సీహెచ్ మధుకృష్ణ, అనురాధ, శివాజీ, శ్రీను, పాల్గొన్నారు.

వరద బాధితులకు శ్రీవిజ్ఞాన్ విద్యార్థులు రూ.50 వేల విరాళం

చోడవరం, అక్టోబర్ 1 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి స్థానిక శ్రీవిజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు, లెక్చరర్లు రూ.50 వేలు విరాళాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజుకు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఈర్లె గోవిందరావు, డైరెక్టర్లు రామకృష్ణ, దామోదర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో అభివృద్ధికి పెద్దపీట

» మాడుగుల ఎమ్మెల్యే బండారు

మాడుగుల, అక్టోబరు 1 : గిరిజన గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తామనిస్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం మాడుగుల ఒకటో వార్డు ఎం.గదబూరు గ్రామంలో ఆయన ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్డు, అంగన్వాడీ భవనం నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సాగులో ఉన్న పోడు భూములకు సంబంధించి అవకాశాన్ని బట్టి పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తామని అన్నారు. అలాగే అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఉపాధిహామీ పుస్తకాలను అందించి పనులు కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, పట్టణ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, పాఠశాల కమిటీ ఛైర్మన్ భీమరాజుమాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టీడీపీ నాయకులు లెక్కల కాశీబాబు, డిల్లీ నానాజీ, పి.సూర్యనారయణరాజు, మరువాడ ఈశ్వర రావు, కొట్నాల త్రినాథ్, పంచాడ శ్రీనివాసరావు, పల్లెల రాము, పుప్పాల రమేష్, మోదినాయుడు పాల్గొన్నారు.



మాడుగుల : గదబూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి



చోడవరం : గౌరీపట్నంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు

చోడవరం : మండలంలో తొలి రోజైన మంగళవారం 97శాతం సంక్షేమ పింఛన్లు పంపిణీ పూర్తయింది. మండలంలో మొత్తం 13 వేల 183 పింఛన్లకు 12వేల 889 మందికి పింఛన్లు అందచేశారు. ఇంకా 244 మందికి మాత్రమే పింఛన్లు అందచేయాల్సి ఉంది. అన్ని పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. మండలంలోని లక్కవరం, గవరవరం పంచాయతీల్లో ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు కొందరు లబ్ధిదారులకు పింఛను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, స్థానిక నాయకులు చొప్పగడ్డి వెంకట స్వామినాయుడు, అడపా రమేష్, ఎస్వీ రమణ, సేనాపతి శ్రీను, నాగులాపల్లి సూర్యనారాయణ, కర్రి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నవరాత్రుల ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సుధారాణి

నర్సీపట్నం, అక్టోబరు 1 : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 3 నుంచి 13 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. మంగళవారం దేవదాయ శాఖ జిల్లా అధికారి కేఎల్ సుధారాణి, కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ప్రధాన అర్చకులు నర్సింహమూర్తి మాట్లాడుతూ ఉదయం సామూహిక కంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ రోజు అమ్మవారి అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సాంబశివరావు, ఉత్సవకమిటీ ప్రతినిధులు జె.నాగేంద్రరాజు, జె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సిబ్బంది గైర్హాజరుతో మద్యం దుకాణాల బంద్

» కాంటాక్ట్ ముగియడంతో ఉద్యోగ భద్రతపై ఆందోళన

» రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ చర్చల హామీతో సాయంత్రానికి విధుల్లోకి..



ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం, అక్టోబరు 1 : ప్రభుత్వ మద్యం దుకాణాలలో పని చేసే సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు షాపులు మూత పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నూతన మద్యం విధానం తీసుకొచ్చి ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గత ఐదేళ్లుగా నియోజకవర్గంలోని 32 మద్య షాపుల్లో 120 మందికి పైగా సిబ్బంది సూపర్‌వైజర్లు, సేల్స్ మేనేజర్లు, నైట్ వాచ్‌మెన్లగా పని చేస్తున్నారు. గత నెల 30తో వీరి కాంట్రాక్ట్ కాల పరిమితి పూర్తి కావడంతో మంగళవారం విధుల్లోకి వెళ్లలేదు. దీంతో ఉదయం 11 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకు నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెంలోని మొత్తం మద్యం షాపులు మూత పడ్డాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసి వేలంపాట ద్వారా ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు కేటాయింపులు చేయాలని నిర్ణయం తీసుకుంది. గత ఐదేళ్లుగా పని చేస్తున్న తమకు ఉపాధి కోల్పోతున్నామని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని నర్సీపట్నం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉదయం 11 గంటలు నుంచి సాయంత్రం వరకు మద్యం షాపులు తెరవకపోవడంతో మందుబాబులు పడిగాపులు కాశారు. బెల్టుషాపుల్లో అధిక ధరలు ఇచ్చి మద్యం కొనుగోలు చేశారు. ఈ నెల ఐదో తేదీన అమరావతిలో ప్రభుత్వ మద్యం దుకాణా సిబ్బందితో చర్చలు జరపడానికి రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ అంగీకరించడంతో వారు సమ్మె విరమించారు.

చోడవరంలో..

చోడవరం : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది దుకాణాలు మూసివేసి నిరసన చేపట్టారు. రాష్ట్రంలో 15 వేల మంది సిబ్బంది మద్యం దుకాణాల్లో పని చేస్తూ వచ్చామని, తమకు న్యాయం చేస్తామని ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీ నెరవేరేంత వరకూ తాము ఆందోళన కొనసాగిస్తామని సిబ్బంది తెలిపారు.

సాయంత్రానికి తెరుచుకున్న దుకాణాలు

సిబ్బంది ఆందోళనతో ఉదయం మూతపడిన మద్యం దుకాణాలు తిరిగి సాయంత్రం 5 గంటలకు తెరచుకున్నాయి. సిబ్బంది ఆందోళనపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందనఉండడంతో రాష్ట్ర సంఘం నేతలు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆందోళన విరమించి దుకాణాలు తెరిచినట్టు సిబ్బంది తెలిపారు.



చోడవరంలో మద్యం షాపు సిబ్బంది నిరసన..

మహిళల ఆర్థిక ప్రగతికి ఆసరా

» డీఆర్‌డీఏ ఏపీడీ కె.శచీదేవీ

దేవరాపల్లి, అక్టోబరు 1 : ప్రతి మహిళా చిరు వ్యాపారవేత్తగా ఎదగాన్నదే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ ఏపీడీ కె.శచీదేవీ పేర్కొన్నారు. మారేపల్లి తదితర గ్రామాల్లో పింఛన్ పంపిణీని మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం వెలుగు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులు మార్కెటింగ్ సదుపాయం కల్పించడం ద్వారా వారిని వ్యాపార రంగంలోకి అడుగు పెట్టేలా చేస్తున్నామన్నారు. ప్రతి మండలం నుంచి మహిళలు తయారు చేసిన కనీసం పది ఉత్పత్తులను బహిరంగ మార్కెట్లో విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్త్రీనిధి ద్వారా ఇప్పటి వరకు 1,91,600 మందికి 98.4 శాతం రికవరీ చేశామన్నారు. పీఎంపీజీపీ పథకాల ద్వారా ఒక్కో మహిళకు రూ.ఏభై వేలు నుంచి రూ.లక్ష రూపాయల వడ్డీ లేని రుణాలు అందజేశామన్నారు. ఏపీఎం ప్రభాకరు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణపై అవగాహన అవసరం

» జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



రైతులకు అవగాహన కలిస్తున్న మోహన్‌రావు

కె.కోటపాడు, అక్టోబరు 1 : రైతులు పంటలపై అవగాహన పెంచుకొని పంట మార్పిడి, ప్రకృతి వ్యవసాయం, సమగ్ర పోషక యాజమాన్యం వంటి పద్ధతులు పాటించాలని, ఇందుకు 'పొలం పిలుస్తోంది'లో వ్యవసాయ శాఖ అధికారులు తగిన సలహాలు, సూచనలు అందిస్తారని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం గొండుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటను సాగు చేసుకోవాలని సూచించారు. వేరుశనగ పంటకు పూత సమయంలో 200 కేజీల జిప్సమ్ వేసుకుంటే మంచి నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. అలాగే అపరాల పంటకు నీటి తడి ఇచ్చి 19.19.19 అనే నీటిలో కరిగే పోషక మందును పూత సమయంలో వాడాలన్నారు. చోడవరం షుగర్ ఫ్యాక్టరీ చీఫ్ అగ్రికల్చర్ ఆఫీసర్ రాము చెరకు రైతులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం రొంగలినాయుడుపాలెంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొండుపాలెం నుంచి మల్లాది రాధాకృష్ణ, బండారు దేముడుబాబు, వంటాకు రెడ్డినాయుడు, ఈర్లే దేముడుబాబు, ఈర్లే మహేంద్ర, బండారు అప్పలపాత్రుడు, పైడంపేట సర్పంచ్ రొంగలి వెంకట రాఘవ నాయుడు, రొంగలి అప్పలనాయుడు, పైలా కోటేశ్వరరావు, షుగర్ ఫ్యాక్టరీ అధికారులు రమణ, మోహన్, ఏఈవో లైలా, గొండుపాలెం వీఏఏ సుధీర్, రొంగలినాయుడుపాలెం వీఏఏ కృష్ణవేణి, వరహాలదొర, హరీష్, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని కోరుతూ వీవోఏల ఆందోళన



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

కె.కోటపాడు, అక్టోబరు 1 : తమక జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమని నిరసిస్తూ వీవోఏలు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. ఇందుకు సంబంధించి ఏపీఎం, సీసీలు సరైన సమాధానం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు కె.సత్యం, ఆరిపాక చిన్నమ్మలు, సీహెచ్.సత్యవతి, బీవీ రమ, పి.మాధవి, ఎన్.మమత, సూరిశెట్టి జయలక్ష్మి, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సమస్యను పరిష్కరించాలి : సీపీఎం

నాతవరం, అక్టోబరు 1 : ఇసుక సమస్యను పరిష్కరించి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు కోరారు. మంగళవారం నాతవరంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించి గత ప్రభుత్వం ఇచ్చిన మెమో 1214 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇసుక కొరత ఉందని, దీంతో మూడు నెలల నుంచి భవన నిర్మాణ కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ, సంఘం ప్రెసిడెంట్ ఎ.మల్లయ్య. సత్తిబాబు, ఎన్.శ్రీను కోటిబాబు పాల్గొన్నారు.

చెకుముకి పోటీలు ప్రారంభం



జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన బూరుగుపాలెం విద్యార్థులు

మాకవరపాలెం, అక్టోబరు 1 : మాకవరపాలెం హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీలను ఎస్ఐ.దామోదర్‌నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం బూరుగుపాలెం హైస్కూల్‌కి చెందిన గనిశెట్టి వినయ్, గరగ రూప, ఆదిపిరెడ్డి శ్రీధర్ జిల్లా సాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, ఉపాధ్యాయులు త్రిమూర్తులురెడ్డి, ఎం.శేషగిరిరావు, ఎన్.శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాతయ్యబాబుకు నేతల అభినందనలు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 1 : రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. మంగళవారం వడ్డాది పార్టీ కార్యాలయంలో తాతయ్యబాబునుతెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, నర్సీపట్నం హౌసింగ్ ఈఈ నీరజ, జెఏసీ నాయకులు శేఖర్, డీఈఈ, ఏఈఈలు శ్రీనివాస్‌రాజు, శ్రీపాణి, సూర్యారావు, ప్రకాష్‌రెడ్డి, రామచంద్రరావు, వెలగ శ్రీను, ప్రసాద్, గోపీ, అనకాపల్లి జిల్లా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తాతయ్యబాబును కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు.



తాతయ్యబాబును సన్మానిస్తున్న నేతలు

ఎల్ఎన్‌పురంలో ఇంటింటా కొళాయిలకు శంకుస్థాపన

రావికమతం, సెప్టెంబరు 1: మండలంలో తట్టబంద పంచాయతీ పరిధి ఎల్ఎన్ పురంలో ఇంటింటా కొళాయిల ఏర్పాటుకు మంగళవారం సర్పంచ్ గోకివాడ రమణ భూమిపూజ చేశారు. జల జీవన్ పథకంలో ఈ గ్రామానికి ఇంటింట కొళాయిల ఏర్పాటుతో పాటు పదివేల లీటర్ల రక్షిత పథకం నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రూ.30 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు చొరవతో ఈ పనులకు మోక్షం లభించింది.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రమణ

తహసీల్దార్‌ను కలిసిన జనసేన నేతలు



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న జనసేన నేతలు

చోడవరం, అక్టోబర్ 1 : మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ అంబటి రామారావును మంగళవారం మండలానికి చెందిన జనసేన నాయకులు కార్యకర్తలు కలిశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు, మండల జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, పట్టణ నాయకులు కర్రి రమేష్, నరవ సరోజిని, సియ్యాద్రి జగదీశ్, దండుపాటి ప్రసాద్, చెప్పగడ్డ శ్రీను, తెలుగుచర్ల మహేష్ పాల్గొన్నారు.

వైసీపీ నేతల చేతివాటం

... 5వ పేజీ తరువాయి

చేతికి అందినకాడికి ఇనుము, సిమెంటు దోచుకుపోయారని సమాచారం. రొంగలివానిపాలేనికి చెందిన ఒక వైసీపీ నాయకుడి అండదండలతో సిమెంట్, ఇనుముతో పాటు తమ సొంత సొమ్ముతో కొనుగోలు చేసిన ఇసుక, కంకరను ఎత్తుకుపోయారని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు.. విచారణకు ఆదేశం

అనకాపల్లి మండలం సంపతిపురం, కూండ్రం, రొంగలివానిపాలెం జగనన్న కాలనీల్లో సిమెంట్, ఐరన్ మాయమవడంపై స్థానిక జనసేన నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలించిన కలెక్టర్.. సిమెంట్, ఐరన్ మాయంపై విచారణ చేపట్టి అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ, వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న సదరు వైసీపీ నాయకులు భయాందోళన చెందుతున్నట్టు తెలిసింది.

విజయదశమికి విజయవాడకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు : డీఎం ధీరజ్



నర్సీపట్నం, అక్టోబరు 1 : విజయ దశమి సందర్భంగా విజయవాడ వెళ్లే భవాని భక్తులు కోసం నర్సీపట్నం డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంఎస్ఎస్ ధీరజ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. టిక్కెట్లు కావాల్సిన వారు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు. నర్సీపట్నం నుంచి విజయవాడ ఒక ప్యాకేజ్, నర్సీపట్నం ద్వారపూడి, విజయవాడకు రెండో ప్యాకేజ్, నర్సీపట్నం నుంచి విజయవాడ, ద్వారపూడి, ద్వారకా తిరుమలకుమూడో ప్యాకేజ్, నర్సీపట్నం నుంచి ద్వారపూడి, గొల్లలమామిడాడ, ద్వారకా తిరుమల, విజయవాడకు నాలుగో ప్యాకేజ్, నర్సీపట్నం నుంచి భద్రాచం, పర్ణశాల, విజయవాడకు ఐదో ప్యాకేజ్ చొప్పున సర్వీసులు నడపనున్నట్టు తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసు, అల్ట్రా డీలక్స్ బస్సులు ఉంటాయని తెలిపారు. రద్దీగా ఉంటే బస్సు సర్వీసులు పెంచుతామని అన్నారు. వివరాలకు ఫోన్ : 9494811855, 7382916428లో సంప్రదించాలని కోరారు.

వృద్ధుల దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ/ కృష్ణాదేవిపేట, అక్టోబరు 1 : అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవజ సందర్భంగా గొలుగొండ, కృష్ణాదేవిపేట పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వృదులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారపు అలవాట్ల, దైనందిన జీవనం కొన్ని మార్పులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్యామ్‌కుమార్, కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి హరిప్రవీణ్, గాయత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కొవ్వూరు వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వృద్ధాశ్రమ కార్యదర్శి యర్రంశెట్టి రాజారావు సర్పంచ్ కాంతమ్మ పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

రోలుగుంట, అక్టోబరు 1: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం రోలుగుంట కేజీబీవీ, పలు జడ్పీ పాఠశాలల్లో పీఆర్టీయూ శాఖ తరఫున టీచర్లు పర్యటించి సభ్యత్వ నమోదుతో పాటు ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పరమేశ్వరరావు

చీడికాడ, అక్టోబరు 1 : మండలంలోని కోనాం పరిధిలోని కొండ్లకొత్తూరులో బీజేపీ సభ్యత్వ నమోదును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వంచంగి పేరయ్య, చెరువూరి రాజ్యలక్ష్మిలతో పాటు పలువురు గిరిజనులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పరవాడ మురళీ, నేతలు రెడ్డి కొండబాబు, సింగంపల్లి రమణమ్మ, చిరువూరి శివాజీరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 4 జట్ల ఎంపిక



పోటీలకు ఎంపికైన బాలుర జట్ల క్రీడాకారులు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 1 : దిబ్బిడిలో జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో నాలుగు బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి 250 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన అండర్-14 క్రీడాకారుల నుంచి రెండు, అండర్-17 నుంచి రెండు చొప్పున జట్లను ఎంపిక చేసినట్టు నేషనల్ రిఫరీ వెంకట్, జిల్లా స్థాయి పరిశీలకులు ఎంఎం మనోహర్ తెలిపారు. ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున మొత్తం 48 మంది బాలబాలికలను ఎంపిక చేశామన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఈ జట్లు పాల్గొననున్నట్టు చెప్పారు. ఎంపికైన జట్లను సర్పంచ్‌లు పి.మాణిక్యం, సుంకర లక్ష్మి, హెచ్ఎం ఎన్.సత్యారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొన్నాబత్తుల శ్రీనివాసరావు. స్కూల్ కమిటీ ఛైర్మన్ పి.అప్పారావు తదితరులు అభినందించారు.

శ్రీలలితాదేవి వృద్ధాశ్రమ వార్షికోత్సవం



ఏఎన్ఎం మణిని సన్మానిస్తున్న వృద్ధాశ్రమ నిర్వాహకులు

చీడికాడ, అక్టోబరు 1 : మండలంలోని అప్పలరాజుపురంలో శ్రీలలితాదేవి వృద్ధాశ్రమం 11వ వార్షి కోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు యాళ్ల వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఎందరో దాతల సహకారంతో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతినెలా కిరాణా సరకులు అందించే పెనుమత్స సత్యనారాయణరాజు అండదండలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో వృద్ధులకు వైద్యపరంగా సేవలు అందించే ఏఎన్ఎం మణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అప్పలరాజుపురం సచివాలయ ఉద్యోగులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.